క్లుప్తంగా

ఆలయాల్లో జిల్లా జడ్జి పూజలు


లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి లక్ష్మీశారద

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతోపాటు తిమ్మాపురంలోని సూర్య క్షేత్రాన్ని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. అర్వపల్లి దేవాలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్ న్యాయమూర్తికి వివరించారు.

విద్యార్థులకు శిక్షణ

తుంగతుర్తి : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గతంలో చదువుకున్న, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసిన, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న 18 నుంచి 25 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులు అని తెలిపారు. ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 19 వరకు తుంగతుర్తిలోని బాలికల గురుకుల పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఫణిగిరి బౌద్ధ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు


బౌద్ధ మ్యూజియం వద్ద చిన్నారులు

నాగారం : అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధ మ్యూజియాన్ని ఆదివారం బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సందర్శించారు. బౌద్ధ శిల్ప సంపదను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోధిసత్వ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులిగిళ్ల వీరమల్లు యాదవ్, నాగరాజు, యాదగిరి, వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో ధ్యాన శిక్షణ

అర్వపల్లి : అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎంవి. రంగారావు ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనం రమేష్, మనుబోతుల వీరయ్య, మేకల సత్యనారాయణ, అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

ఆత్మకూర్(ఎస్) : నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా విప్లవోద్యమానికి నాయకత్వం వహించి, ఎన్నో ప్రజా ఉద్యమాలు నిర్మించిన నాయకుడు జెన్ను అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జిలేరు అన్నారు. ఆదివారం ఏపూరు గ్రామంలో జెన్ను సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25న ఏపూరులో నిర్వహించే సంస్మరణ సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంచనపెల్లి సైదులు, ఎల్లయ్య, రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


పద్మ(ఫైల్)

అర్వపల్లి: తెలంగాణ ఉద్యమకారుడు, రిటైర్డు ఎంపీడీఓ పెరుమాళ్ల వెంకటయ్య సతీమణి, అడివెంల తాజా మాజీ సర్పంచ్ పెరుమాళ్ల పద్మ(78) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కాగా పలువురు నాయకులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, చిర్రబోయిన వెంకన్న, నోముల లింగయ్య, తిరుమల్, శైలేందర్, కొమ్మనబోయిన వెంకన్న, విద్యాసాగర్, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని యడవెల్లిలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై రెండు ఎద్దులు మృతి చెందాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మున్నా గంగమల్లు, భయ్యా గంగయ్యకు చెందిన ఎద్దులను ఏనె కుంట సమీపంలోని తమ వ్యవసాయ పొలాల వద్ద మేతకు వదిలారు. ఆ సమయంలో రెండు ఎద్దులు పొట్లాడుకొని పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ సుమారు రూ.1.50 ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తిరుమలగిరిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు


నూతనకల్ : నాగార్జున పాఠశాల పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంకెపల్లి రాంరెడ్డి, మండడి పద్మారెడ్డి, రామచంద్రయ్య, దామోదరాచారి, ఆదిల్‌పాషా, దేవదాస్ పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని పసునూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 1996–97 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు వెంకన్న, నారాయణ, పురుషోత్తం, నర్సిరెడ్డి, నీరజ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, బొక్క వీరారెడ్డి, మండడి సోమిరెడ్డి, రేపాక లింగయ్య, మంజుల, విజయ నిర్మల, చంద్రశేఖర్‌రెడ్డి, భవాని, బద్దం ప్రశాంత్‌రెడ్డి, చూడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో విద్యార్థులు వట్టికూటి సైదులు గౌడ్, వెంకన్న, నాగరాజు, లింగయ్య, శంకర్, మల్లయ్య, శేఖర్, రవి, కవిత, కల్పన, స్రవంతి, నిర్మల పాల్గొన్నారు.


నాగారం : పసునూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..


ఆత్మకూర్(ఎస్) : తుమ్మలపెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

తూర్పుతండా వాసులకు తీరిన కష్టాలు

- కాసర్లపహాడ్ చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణం
- రూ.2.10 కోట్లతో వంతెన, రోడ్డు పనులు

అర్వపల్లి : ఆ తండా ప్రజల చిరకాల వాంఛ ఎట్టకేలకు తీరింది. తమ తండాకు బీటీరోడ్డు, చెరువు అలుగు వద్ద బ్రిడ్జిలను నిర్మించాలని మారుమూల ప్రాంతంలో ఉన్న తండా గిరిజనులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. అదే జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండా. ఈ తండా రోడ్డు మొన్నటి వరకు ఫార్మేషన్‌రోడ్డే. అయితే తండాకు బీటీరోడ్డు, కాసర్లపహాడ్ గ్రామ చెరువు అలుగు వద్ద తండాకు వెళ్లే రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 2.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఏడాది కిందట కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తండాకు 3కి.మీ బీటీ వేశారు. కానీ అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. దీంతో చెరువు నిండిన ప్రతిసారి అలుగుతో తండాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి ..

తండాకు వెళ్లే దారిలో కాసర్లపహాడ్ చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను 20 రోజుల కిందట ప్రారంభించారు. ప్రస్తుతం పనులు పూర్తయ్యాయి. క్యూరింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతో గిరిజనులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక నుంచి చెరువు నిండి అలుగు వచ్చినా గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీంతో తండా గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కాసర్లపహాడ్ చెరువు అలుగు వద్ద నిర్మించిన బ్రిడ్జి

మా ఇబ్బందులు తీరాయి



మా తండాకు ఏడాది కిందట బీటీ రోడ్డు నిర్మించగా ప్రస్తుతం బ్రిడ్జి పనులు జరిగాయి. కాసర్లపహాడ్ చెరువు అలుగుపై బ్రిడ్జి నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు తీరాయి.

– సైదులు, తండావాసి

బాలభవన్ సమ్మర్ క్యాంపులో దంత వైద్యశిబిరం


డెంటల్ డాక్టర్లను శాలువాలతో సన్మానిస్తున్న బాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి

సూర్యాపేట : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాల్ భవన్ వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సూర్యాపేట అధ్యక్షుడు డాక్టర్ దినేష్ కుమార్, సెక్రటరీ అరుణ్ కుమార్, డాక్టర్ మహేష్, డాక్టర్ చందనలు దంత పరీక్షలు చేశారు. బాల, బాలికలకు టూత్ బ్రష్, టూత్ పేస్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడారు. పిల్లలంతా ఉదయం, రాత్రి బ్రష్ చేయాలని, మూడు నుంచి ఆరు నెలల లోపే బ్రష్‌ని మారుస్తూ ఉండాలన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు ఉంటేనే ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. అనంతరం బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐడీఏ డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్ భవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, సత్యనారాయణ సింగ్, ఉమా, అనిల్, సాయి, వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు


గ్రామం చుట్టూ పొత్తి పోస్తున్న దేశగురువు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవాలను ఆదివారం రెండవ రోజు గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలూరు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామం చుట్టూ నవ ధాన్యాలతో పొత్తిపోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. బొడ్రాయి వద్ద పూజలు, రుద్రచండీ హోమం, మంత్రపుష్పం, మంగళ నిరాజనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండింతులు కొండగడప హరిప్రసాద్‌శర్మ, కాశీ లక్ష్మణశర్మ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కన్వీనర్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిల్లర చంద్రమౌళి, గోడిశాల యాదగిరి, కన్నెబోయిన రాముయాదవ్, పేరాల యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన నారసింహ హోమం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీసుదర్శన నారసింహ సహిత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి హోమాన్ని అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడారు. ఆలయంలో ప్రతి నెలా మూడవ ఆదివారం హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో పురాతన ఆలయాలలో ఉత్తర ముఖం కలిగిలిన ఏకైక మహిమాన్విత క్షేత్రం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం అని అన్నారు. ఆలయంలో జరిగే విశేష పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాద్, చైర్మన్ గుకంటి రాజబాబు, భక్తులు ముడుంబై సారిక, అంకం భిక్షం, మల్లీశ్వరి, మెరెడ్డి సువర్ణ, గవ్వ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రఘుపాల్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు


నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : సీపీఎం హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రఘుపాల్ మృతి సీపీఎంకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రఘుపాల్ జీవితం కమ్యూనిస్టు పార్టీ నాయకులకు, ఉద్యమకారులకు ఆదర్శవంతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్, జయ నరసింహారావు, వీరబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

లోయపల్లిలో పశు వైద్యశిబిరం

అర్వపల్లి : తిమ్మాపురం పశు వైద్యశాల పరిధిలోని లోయపల్లిలో ఆదివారం పశు వైద్యశిబి రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, ఓఎస్ మధుసూదన్, గోపాలమిత్ర ఆల్డాస్ లింగయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం


అలంకారంలో శ్రీభక్తాంజనేయ స్వామి


కలశ స్థాపన పూజలో దేవాలయ అర్చకులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని తహసీల్దార్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీహనుమాన్ జయంతి పంచాహ్నిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు దరూరి రామానుజాచార్యులు, దరూరి శ్రీధరా చార్యులు శ్రీఆంజనేయ స్వామికి ప్రత్యేక పంచామృత అభిషేకం నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మొదటి రోజు కలశ స్థాపన, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, కంకణ ధారణ నిర్వహించారు.

నేడు సుందరహోమం..

శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సుందరహోమం, 108 కలశములతో అష్టోత్తర శతఘటాభిషేకం, అర్చనలు నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలి పారు. ఈ వేడుకల్లో దేవాలయ కార్యనిర్వహణాధి కారి లక్ష్మణరావు, దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు, అర్చకులు శ్రీకాంతాచా ర్యులు, దరూరి పవన్ కుమారాచార్యులు, దరూరి కార్తీకచార్యులు, దరూరి శ్రీనాథచార్యులు, భక్తులు వెంపటి సురేష్, పబ్బా ప్రకాష్, సీహెచ్.వెంకటేశ్వర్లు, పబ్బా రామమూర్తి, దేవాలయ సిబ్బంది దేవేంద్రచారి, నాగరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పనిచేస్తున్న వారిని గుర్తించాలి


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడి పనిచేస్తున్న వారిని ఎమ్మెల్యే సామేల్ గుర్తించాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అర్వపల్లిలో కాంగ్రెస్ నాయకులతో పాటు పార్టీ అనుబంధ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకుల మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ స్వార్థం కోసం ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన వారిని ఎమ్మెల్యే వెంట తిప్పుకుంటూ పార్టీకోసం అహర్నిశలు పనిచేస్తున్న వారిని పక్కకు పెట్టడం తగదన్నారు. అర్వపల్లిలో డీసీసీ కాంగ్రెస్ మండల సమావేశం నిర్వహించ తలపెడితే కొంతమంది బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులు అడ్డుకొని దాడులు చేసినట్లు తెలిపారు. ఇటీవల కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన కొంతమంది తమపై తప్పుడు మాటలు మాట్లాడటం తగదన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారిపై తప్పుడు ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలను నిరూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేనివారు తమను విమర్శించడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్ గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పెసర సతీష్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ గంట జయంత్, ఆలయ ధర్మకర్తలు జె.సోమయ్య, బి.శ్రీధర్‌రెడ్డి, బాసపోలు శ్రీను, నాయకులు రాంబాబు, శ్రీను, కృష్ణమూర్తి, మధు, రాజేష్, నాగరాజు, నాగేష్, బింగి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం


శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


కల్యాణానికి హాజరైన భక్తులు

పెన్‌పహాడ్ : అనాజీపురం గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు శ్రీరామ కవచం నాగయ్యశాస్త్రి, చెన్ను రమణారెడ్డి, మొగిలిచర్ల వెంకన్న, ఏరెడ్ల మట్టారెడ్డి, జిల్లేపల్లి వెంకటరత్నం, ఊట్కూరి లింగారెడ్డి, కత్తి జగదీష్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనుపాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మాచిరెడ్డిపల్లిలో బడిబాట కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆదివారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, రాగిజావ, మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళారూపాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి మహోత్సవం

అర్వపల్లి : తిమ్మాపురం సూర్యక్షేత్రం ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మహోత్సవం సందర్భంగా ఉదయం హనుమాన్ జయంతి, ఆ తర్వాత సీతారాముల కల్యాణోత్సవం జరుగుతాయని చెప్పారు. మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని అర్వపల్లి, తిమ్మాపురం, రామన్నగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా 8లారీల ధాన్యాన్ని మిల్లులకు పంపినట్లు తెలిపారు. రైతులు ప్రైవేటుగా వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదని, రైతుల ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్‌లు రామరాజు జలేందర్‌రావు, పాటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


అర్వపల్లిలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఎమ్మెల్యే సామేల్‌ను దూషిస్తే సహించేదిలేదు


మాట్లాడుతున్న పరశురాములు

నాగారం : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను దూషిస్తే సహించేదిలేదని కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు పాల్వాయి పరశురాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కించపరిచేలా అగ్రవర్ణాలకు చెందిన వారు వ్యవహరిస్తున్నారని అన్నారు. దళిత ఎమ్మెల్యే సామేల్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అవమాన పరుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు సహకరించి నియోజకరవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిప్పలపల్లి అంజయ్య, సోమయ్య, ఎల్లయ్య, విక్రమ్, శ్రీను, శ్యామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం


నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రూ.25,000 విరాళం ప్రకటించారు. ఆ నగదును ఆదివారం ఈటూరు గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవ కమిటీ కన్వీనర్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండగాని అంబయ్య, చిల్లర చంద్రమౌళి, గంట నర్సింహారెడ్డి, దోమల బాలమల్లు, పేరాల యాదగిరి, గోడిశాల యాదగిరి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారంలోని బేతేల్ ప్రార్థన మందిరంలో పాస్టర్ పాడపంగి సునీల్‌బాబు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా విద్యార్థులకు సీబీసీ పరిజ్ఞానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆటలు, పాటలు, బైబిల్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రమేష్‌బాబు, సంఘ సభ్యులు లక్ష్మమ్మ, రాములమ్మ, విలమ్మ, శిల్ప, ప్రమీల, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై చర్య తీసుకోవాలి

మునగాల : జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియా నడుస్తుందని, ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు లేకున్నా ఆస్పత్రులు ఏర్పాటు చేసుకొని ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న జిల్లా వైద్యాధికారిని సస్పెండ్ చేయాలన్నారు.